ములుగు ఎన్‌కౌంటర్‌లో రాణాపూర్‌వాసి మృతి

- కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చిన పోలీసులు
- విషాదంలో మలయ్య సోదరులు, గ్రామస్తులు
- ముగిసిన మూడు దశాబ్దాలకు పైగా మవోయిస్టు ఉద్యమం

పాలకుర్తి, డిసెంబర్ 1: ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, అలియాస్ కోటి మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఉదయం నుంచే ఎన్‌కౌంటర్‌లో ఏగోలపు మల్లయ్య మృతి చెందినట్లు సోషల్ మీడియాలో సమాచారం రావడంతో ఆయన సోదరులు ఏగోలపు రాజయ్య, ఏగోలపు లక్ష్మణ్, ఏగోలపు శ్రీనివాస్ తీవ్ర దుఃఖంలో మునిగారు. 1992 ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమంలో చేరిన మల్లయ్య 32ఏండ్లుగా అజ్ఞాతంలో ఉంటూ వివిధ హోదాల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో పని చేసిన ఆయన, ఉన్న ఊరు, కన్నవారిని కలిసిన దాఖలాలు లేవు. రెండేండ్ల క్రితం మల్లయ్య తల్లి వెంకవ్వ మృతి చెంది నప్పుడు ప్రజా సంఘాలు సంతాప సభ నిర్వహించగా, పోలీసులు ఆంక్షలు విధించారు. తల్లిని కడసారి చూసేందుకు మల్లయ్య వస్తాడని పోలీసులు నిఘా పెట్టగా, మల్లయ్య అజ్ఞాతంలో ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో మల్లయ్య మృతి చెందాడని వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విలపిస్తున్నారు. కాగా, మల్లయ్య తల్లిదండ్రులు వెంకమ్మ-గట్టయ్య గతంలో మృతి చెందారు. ముగ్గురు అన్నలు, ఇద్దరు చెల్లెలు ఉన్నారు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో మృతదేహం గుర్తింపు కోసం సోమవారం ఉదయం వెళ్తామని ఆయన సోదరులు తెలిపారు.

కాపులపల్లిలో కోడిపందేల శిబిరంపై దాడి

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 1: పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి శివారు ప్రాంతంలో రహస్యంగా కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పెద్దపల్లి టాస్క్ ఫోర్స్ పోలీసులు తమ సిబ్బందితో కోడిపందే ల శిబిరంపై దాడి చేశారు. స్థానికుల నుంచి రహస్యంగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజేశ్ తమ సిబ్బందితో దాడి చేశారు. ఏడుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 13 పందెం కోళ్లు, 60 కత్తులు, 5సెల్ ఫోన్లు, రూ.6,530 స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. మరికొంత మంది పరారీలో ఉన్నట్లు కూడా వెళ్లడిస్తూ త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామని ప్రకటించినప్పటికీ విషయంలో పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడిన వారిలో రాగినేడుకు చెందినప తాళ్ల రాములు, యాదగిరి అనిల్, పాలకుర్తికి చెందిన రావుల మధునయ్య, కొత్తపల్లికి చెందిన బి వెంకటేష్, బ్రాహ్మణపల్లికి చెందిన మూల మహేందర్, పెద్దపల్లికి చెందిన భూతగడ్డ నర్సయ్య, సుల్తానాబాద్‌కు చెందిన మైదంపల్లి రవితేజలను అదుపులోకి తీసుకొని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు.

మాలల సింహగర్జనకు తరలిన నేతలు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 1:హైదరాబాద్‌లో జరిగిన మాలల సింహగర్జన సభకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో మాల సంఘం నాయకులు తరలివెళ్లారు. ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బంధు లబ్ధిదారుల జాబితాను కులాల వారీగా ప్రకటించాలని, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను కులాల వారీగా బహిర్గతం చేయాలనీ, మాలల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు మాలల పోరాటం ఆగదన్నారు.

వ్యాస రచన పోటీలు

జూలపల్లి, డిసెంబర్ 1 : జూలపల్లిలోని ఎమ్మార్సీ భవన్‌లో ఆదివారం ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అశ్విత (జూలపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల), మణిక్రాంత్ (తేలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల), స్నిగ్ధ (న్యూ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల)కు ఎంఈవో సరస్వతి బహుమతులు అందజేసి అభినందించారు. ఉపాధ్యాయురాలు వీణ, సీఆర్పీలు సతీశ్, తిరుమల పాల్గొన్నారు.

పాలకుర్తి,డిసంబర్1: బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎంఈవో విమల ఆధ్వర్యంలో ఉన్నతపాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో రోషిని టి. సాయివర్షిత బి.హిరణ్య విజేతలుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

పెద్దపల్లి టౌన్, డిసెంబర్1: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న కుమారి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక జిల్లా దవాఖాన నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో జిల్లా సివిల్ జూనియర్ జడ్జి మంజుల పాల్గొన్నారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ కార్యాలయ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో మాట్లాడారు. జిల్లాలో ఈ యేడు 13773 హెచ్ ఐవీ టెస్టులు నిర్వహించగా 51 కేసులు నిర్ధారణ అయినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 1774 మంది వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండంలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు వాడుతూ సాధారణ జీవనాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజగోపాల్, పెద్దపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, వలంటీర్లకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు కే వీ సుధాకర్ రెడ్డి, ఆర్ రాజమౌళి, వాణీశ్రీ, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో రవీందర్, ట్రాన్స్‌జెండర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఖని డిపోలో కార్తీక వనభోజనాలు

కుటుంబ సమేతంగా వన భోజనాలు చేస్తున్న ఆర్టీసీ డిపో ఉద్యోగులు

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 1: కార్తీక మాసానిన పురస్కరించుకొని గోదావరిఖని ఆర్టీసీ డిపోలో కార్తీక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. డిపో ఉద్యోగులు కుటుంబ సమేతంగా తరలివచ్చి వన భోజనాలు చేశారు. డిపో మేనేజర్ నాగభూషణం ఉద్యోగులకు ఆటపాటలు నిర్వహించారు. ఉద్యోగులు జయప్రద, రమాదేవి, నాగేంద్ర, చంద్రయ్య, మాధవి, వనిత, ఎస్‌కే నబీసా, సమ్మయ్య, రేణుక, సుమలత, తిరుపతి, కే రాజిరెడ్డి, అనుజ్ఞ, దివ్య విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు అందజేశారు. ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫీక్) కే గీతా కృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్(మెకానిక్) సంధ్యారాణి, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఎన్ పద్మావతిగౌడ్, జెఆర్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో రెండో విడత వన భోజనాలు

మంథని, డిసెంబర్ 1: స్థానిక ఆర్టీసీ డిపోలో రెండో విడత వన భోజనాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది భార్యభర్తలతో సహా వన భోజనాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు కలిసి భోజనాలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించగా ఆ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

ఫిల్టర్ బెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

గోదావరిఖని, నవంబర్ 1: తాగునీటి సరఫరాకు ఆర్జీ-1 ఏరియాలో చేపడుతున్న రాపిడి గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. రామగుండం ఏరియాలో దాదాపు 14వేల మంది కార్మికుల కంపెనీలో పనిచేస్తున్న మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రానున్న ఎండాకాలం దాకా కూడ కార్మికులకు కలుషిత నీరే దిక్కునుండన్నారు. రాపిడి గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణం త్వరితగతిన చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇక్కడ టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డెపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, దూట శేషగిరి, కోండ్ర అంజయ్య, జనగామ మల్లేశ్, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

కమ్ముకుంటున్న మబ్బులు.. రైతుల్లో గుబులు

వడ్లు కుప్ప చేస్తున్న రైతు

మంథని, డిసెంబర్ 1: ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండడంతో రైతుల్లో గుబులు పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫెంగల్ తుఫాన్ కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు గాలం కష్టించిన పంట వర్షానికి ఎక్కడ దెబ్బతింటుందోనని ఆకాశం వైపు బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నల్లటి మబ్బులు కమ్ముకునన్నాయి. కాసేపు చిరుజల్లులు కురిశాయి. ఆయా కొనుగోలు కేంద్రాల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. వడ్ల కుప్పలను ఒక్కదగ్గరకు పేర్చుకొని వర్షానికి తడవకుండా టార్పాలిన్ కప్పుకుంటూ వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఖనిలో బజరంగ్ దళ్ కార్యకర్తల కవాతు

కోల్‌సిటీ, డిసెంబర్ 1: గోదావరిఖనిలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో బజరంగ్ దళ్ త్రిశూల్ దీక్ష నిర్వహించారు. పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, ప్రధాన వక్తగా రాష్ట్ర కన్వీనర్ శివరాములు, జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్ మాట్లాడారు. త్రిశూల్ దీక్ష తీసుకున్న 500 మంది కార్యకర్తలు కాషాయ జెండాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు డాక్టర్ స్వరూప్ కిరణ్, నాగుల మల్యాల సత్యం, మాదవరపు వెంకటరావు, ఇసంపల్లి వెంకన్న, సంపత్ యాదవ్, రవీందర్, మోడం సురేందర్, సమ్మన్న, వెంకటస్వామి, సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మా నాన్న నన్ను క్షమించండి

- మిమ్మల్ని కాదని ప్రేమ పెండ్లి చేసుకున్న
- నా కొడుకుని జాగ్రత్తగా చూసుకోండి
- సెల్ఫీ వీడియోతో వివాహిత ఆత్మహత్య

దీప్తి(ఫైల్)

జ్యోతినగర్, డిసెంబర్ 1: అమ్మ నాన్న నన్ను క్షమించండి.. మిమ్మల్ని కాదని ప్రేమ పెండ్లి చేసుకున్న.. నా భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్న.. నా కొడుకుని జాగ్ర త్తగా చూసుకోండి.. అంటూ ఓ వివాహిత శనివారం అర్ధరాత్రి సెల్ఫీ వీడియో తీసుకుని ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నది. ఈ ఘటన ఎన్టీపీసీలో జరిగింది. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ అన్న పూర్ణ కాలనీకి చెందిన దేవరకొండ దీప్తి(28) స్థానిక ఆటోనగర్‌కు చెందిన అహర్వార్ నరేందర్‌ను 2021లో ప్రేమించి పెండ్లి చేసుకున్నది. వీరికి రెండేండ్ల కొడుకు ఉన్నాడు. కొద్ది రోజులుగా భర్త నరేందర్ రూ.20లక్షల కట్నం తేవాలని రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి వేధింపులకు గురిచేసే వాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తర్వాత తన కొడుకుని తీసుకొని ఆటోనగర్‌లోని తల్లిదండ్రుల ఇంటికి నరేందర్ వెళ్లాడు. దీంతో దీప్తి మనస్తాపం చెందింది. నరేందర్ ఇంటికి తిరిగి వచ్చేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. దీప్తి తండ్రి దేవరకొండ దివాకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేయగా, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ విచారణ చేపట్టారు.

ఈతవనం తొలగింపుపై ఆందోళన

పాలకుర్తి, డిసెంబర్1: రాణాపూర్ శివారులో ఎన్టీపీసీ యాజమాన్యం ఈతవనం తొలగింపుపై గ్రామ గీతాకార్మికులు ఆదివారం ఆందోళన చేశారు. ఎన్టీపీసీ రిజర్వాయర్ సమీపంలో ఉన్న వందలాది ఈతవనం ద్వార రాణాపూర్, కన్నాల గ్రామాలకు చెందిన వందలాది గీతాకార్మికులు కల్లుగీసుకుంటు ఉపాదిపొందుతున్నామని, యాజమాన్యం గీతాకార్మికులకు, ఎక్సైస్ శాఖకు సమాచారం ఇవ్వకుండా ఈత చెట్లు పూర్తిగా తొలగిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి, ఈతవనం తొలగించకుండా ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికసంఘాలకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఏటీఎం చోరీకి యత్నించిన నిందితుల అరెస్ట్

జ్యోతినగర్, డిసెంబర్ 1: ఎన్టీపీసీలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున డబ్బుల చోరీకి యత్నించిన నిందితులను ఎన్టీపీసీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్యాంకు మేనేజర్ రణాధీర్ ఫిర్యాదుతో రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపటారు. స్థానిక బీ పవర్‌హౌజ్ వద్ద ఇద్దరు ఏటీఎం చోరీకి యత్నించిన నిందితులు పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన తుమ్మల మధు, బండ్ల అబ్రహంలుగా గుర్తించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోని వారి వద్దనుంచి ఏటీఎం చోరీకి ఉపయోగించిన ఇనుప సుత్తీ, జర్కిన్‌లు, మంకీ క్యాప్‌లు, మాస్కులు, గ్లౌజులు, సెల్‌ఫోన్‌లను స్వాధీన పరుచుకోని నిందితులపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్స్ టీ అంజయ్య, జే శ్రీనులను సీఐ అభినందించారు.

ఏ బీమా ఉత్తమం?

టర్మ్ ప్లాన్-వ్యక్తిగత ప్రమాద బీమాల్లో తేడాలేమిటి?

ఎవరికి ఎప్పుడు.. ఎక్కడ.. ఏమవుతుందో తెలుసుకోవడం చాలా కష్టం. అందుకే ప్రతీ ఒక్కరికీ బీమాతోనే భీమా. ఆపత్కాలంలో ముఖ్యంగా మనం లేని రోజున మన కుటుంబానికి కొండంత అండగా ఉండేది బీమానే మరి. అలాంటి బీమాల్లో అనేక రకాలున్నాయి. జీవిత బీమా, ఆరోగ్య బీమా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌లు ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రీమియంలు, కాలవ్యవధులు, వాటి ప్రయోజనాలనుబట్టి ఆయా వర్గాల్లో ఇవి ఆదరణను సొంతం చేసుకుంటున్నాయి. అయితే ఇటీవలి కాలంలో టర్మ్ ప్లాన్స్‌కు, వ్యక్తిగత ప్రమాద బీమాలకు చాలా డిమాండ్ కనిపిస్తున్నది. మరి వీటిలో ఏది ఉత్తమం? అసలు ఈ రెండింటిలో ఉన్న తేడాలేమిటి?

టర్మ్ ఇన్సూరెన్స్ అనేది జీవిత బీమాలో ఓ రకం. నిర్ణీత కాలవ్యవధికిగాను పాలసీదారునికి లైఫ్ కవరేజీనిస్తుంది. ఒకవేళ పాలసీ కాలంలో పాలసీదారుడు చనిపోతే బీమా సంస్థ నామినీలకు బీమా సొమ్మును అందిస్తుంది. కుటుంబ పెద్ద లేని లోటును, ప్రధానంగా కుటుంబ సభ్యుల భవిష్యత్తు ఆర్థిక అవసరాలను తీర్చడంలో టర్మ్ ప్లాన్లు చాలాచాలా పాపులారిటీనే సంపాదించాయి. నెల, 3 నెలలు, 6 నెలలు, ఏడాది చొప్పున ఈ బీమా కోసం పాలసీదారులు ప్రీమియం మొత్తాలను చెల్లించవచ్చు. కొన్ని ప్లాన్లలో ఒకేసారి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మరికొన్ని ప్లాన్లకు పాలసీదారుడు తన వీలునుబట్టి కాలవ్యవధి మొత్తానికి చెల్లించే ప్రీమియంలను ముందే చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది. ఉదాహరణకు మీ పాలసీ కాలవ్యవధి 20 లేదా 30 ఏండ్లు ఉందనుకుంటే దాని ప్రీమియంలను ఆ 20-30 ఏండ్లు నిర్ణీత వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. లేదంటే ప్రీమియం మొత్తాన్ని 5, 10, 15 ఏండ్లకు కుదించి కూడా వాయిదాల పద్ధతుల్లో చెల్లించవచ్చు. ఇక పాలసీ తీసుకునేటప్పుడున్న వయసు, విద్య, ఆరోగ్య పరిస్థితులు, ఆదాయం, బీమా ప్రయోజనం, కాలవ్యవధిల ప్రకారం ప్రీమియంలను, బీమా మొత్తాలను నిర్ణయిస్తారు. అయితే ఈ టర్మ్ ఇన్సూరెన్స్‌ల్లో మనీ బ్యాక్, మనీ బ్యాక్ లేని పాలసీలు కూడా ఉంటాయి. పాలసీదారుడు పాలసీ కాలవ్యవధిలో చనిపోకుంటే చెల్లించిన ఆ ప్రీమియంలు తిరిగి రావు. చనిపోతే మాత్రం హామీ మేరకు పాలసీ సొమ్ము మొత్తం వచ్చేస్తుంది. ఇక్కడితో ఆ పాలసీ ముగిసిపోతుంది. ఒకవేళ చనిపోకున్నా కట్టిన ప్రీమియంలు తిరిగి రావాలంటే మాత్రం.. సాధారణ ప్రీమియం కంటే ఎక్కువ మొత్తాలను చెల్లించాల్సి ఉంటుంది. ఇక కనిష్ఠంగా 4 ఏండ్ల నుంచి గరిష్ఠంగా 60 ఏండ్లదాకా టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ కాలవ్యవధిని నిర్ణయించుకోవచ్చు. మీ వయసుపై ఇది ఆధారపడి ఉంటుంది.

వ్యక్తిగత ప్రమాద బీమా

వ్యక్తిగత ప్రమాద బీమా అనేది ప్రమాదం బారినపడ్డ పాలసీదారులకే వర్తిస్తుంది. ప్రమాదం కారణంగా చనిపోయినా, లేదంటే శాశ్వత అంగవైకల్యానికి గురైనా, తీవ్ర గాయాలపాలైనా పాలసీని క్లెయిం చేసుకోవచ్చు. ఎలాంటి ప్రమాదం సంభవించకపోతే పాలసీ వర్తించదు. ప్రమాదంతో దవాఖానపాలైనా వైద్య ఖర్చుల కోసం బీమా సొమ్మును పొందే వెసులుబాటు ఉంటుంది. కానీ పాలసీ నిబంధనలు, షరతులకు లోబడి ఈ సౌకర్యాలను అందుకోగలం. అయితే ప్రమాదం సహజంగా కాకుండా ఉద్దేశపూర్వకంగా జరిగినట్టు ఉంటే మాత్రం బీమా సొమ్ము రాదు. ఉదాహరణకు మీరు కారులో వెళ్తున్నప్పుడు ప్రమాదం సంభవిస్తే.. అప్పుడు మీరు మద్యం, ఇతరత్రా మత్తు పదార్థాలను తీసుకున్నా, రాంగ్ రూట్‌లో వెళ్లినా మీ క్లెయిం రిస్క్‌లో పడుతుంది. ఇక వ్యక్తి వయసు, ఆరోగ్యం, ఇతరత్రా పరిస్థితులేవీ కూడా ఇందులో ప్రాధాన్యం కావు. పాలసీదారులు చెల్లించే ప్రీమియంలనుబట్టి బీమా ప్రయోజనాలుంటాయి.

చివరగా..

వ్యక్తిగత ప్రమాద బీమా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ రెండూ ముఖ్యమే. దేని ప్రాధాన్యత దానికి ఉంటుంది. ప్రమాదంలో గాయపడి, వైద్య చికిత్సను తీసుకుంటున్నప్పుడు టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ వర్తించదు. అప్పుడు మనల్ని రక్షించేది పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్సే. కాబట్టి రెండింటినీ తీసుకోవడం ఉత్తమం. ఇక బీమా ప్రీమియంలకు ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. అలాగే బీమాను ఎప్పుడూ భారంగా భావించవద్దు. మన కుటుంబ సభ్యులకు ఇదే కొండంత ధైర్యాన్ని వ్యగలదు. ఆర్థిక భద్రతనూ కల్పిస్తుంది.

రుణ భారం తగ్గేదెలా?



రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. ఫలితంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నవారికి ఉపశమనం కలగడం కలగానే మారిపోతున్నది. ముఖ్యంగా గృహ రుణ గ్రహీతలపై భారం తడిసి మోపెడవుతున్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే బ్యాంకింగ్ రంగ నిపుణులు ఈ రుణ భారం తగ్గించుకోవడానికి కొన్ని మార్గాలను సూచిస్తున్నారు.

ఇదీ సంగతి..

గృహ రుణం వంటి దీర్ఘకాల లోన్లను తీసుకున్నవారికి అధిక వడ్డీరేట్లు శరాఘాతమే అవుతాయి. అయితే రుణ కాలపరిమితిని వీలైనంత తగ్గించుకుంటే వడ్డీ భారం కూడా తక్కువగా పడుతుందని ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. చక్రవడ్డీ నుంచి ఉపశమనం లభిస్తుండటమే ఇందుకు కారణం. ఉదాహరణకు పదేండ్ల కాలవ్యవధితో రూ.50 లక్షల రుణాన్ని 9 శాతం వార్షిక వడ్డీరేటుకు తీసుకున్నట్టైతే రూ.26 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. కానీ ఇదే రుణాన్ని 15 ఏండ్ల కాలవ్యవధితో తీసుకుంటే వడ్డీ భారం రూ.41 లక్షలకు, 20 ఏండ్లకైతే రూ.58 లక్షలకు పెరుగుతున్నది. కాబట్టి వీలున్నప్పుడల్లా కొద్దికొద్దిగా అసలు రుణాన్ని తీర్చుతూపోతే టెన్యూర్‌ను తగ్గించుకోవచ్చు. ఈఎంఐలను మాత్రం తగ్గించుకోకూడదని గుర్తుంచుకోవాలి. ఈఎంఐ తగ్గితే భారం అంతే ఉంటుంది. అలాగే పెరిగే మీ ఆదాయాన్నిబట్టి ఏటా మీ ఈఎంఐలను పెంచుకుంటూపోయినా రుణ భారం తగ్గుతుందని సూచిస్తున్నారు. ఈఎంఐని ఏటా 5 శాతం పెంచుకుంటూపోయినా 20 ఏండ్ల కాలవ్యవధితో ఉన్న గృహ రుణం 18 ఏండ్లకు తగ్గించుకోవచ్చని చెప్తున్నారు. ఈఎంఐ 10 శాతం పెంచుకుంటే 9 శాతం వార్షిక వడ్డీరేటుతో ఉన్న రూ.50 లక్షల రుణం కాలవ్యవధి 10 ఏండ్లకు తగ్గుతుంది.

ఊగిసలాటలో మార్కెట్లు!

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభనష్టాల దోబూచులాటలు కొనసాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా పడుతూలేస్తూ పయనిస్తున్న సూచీలు.. గడిచిన వారం కూడా అదేదారిలో నడిచాయి. మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. అయినప్పటికీ ఆఖర్లో పెట్టుబడులకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 685.68 పాయింట్లు లేదా 0.86 శాతం బలపడి 79,802.79 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 223.85 పాయింట్లు లేదా 0.93 శాతం పుంజుకొని 24,131.10 దగ్గర స్థిరపడింది. ఈ వారం విషయానికొస్తే.. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, గౌతమ్ అదానీ లంచం కేసు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేయవచ్చు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దేశ జీడీపీ గణాంకాలు నెమ్మదించడంపై మార్కెట్ రియాక్షన్ కీలకం కానున్నది. అంతేగాక నవంబర్ నెల వాహన విక్రయాలు ఆటో షేర్లపై ప్రభావం చూపవచ్చు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. అమెరికాలో పెరిగిన ద్రవ్యోల్బణం, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ఊహాగానాలనూ తోసిపారేయలేమన్న అంచనాలున్నాయి. దీంతో ఒడిదొడుకులు ఈ వారం కూడా తప్పవనే అనిపిస్తున్నది. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ ప